నిద్రపోతున్న నిఘా

కరీంనగర్‌లో మయన్మార్‌వాసులు...

- పాస్‌పోర్ట్‌, వీసాలు లేకుండా ఉమ్మడి జిల్లాలో సంచారం
- హైదరాబాద్‌కు తరలించిన పోలీసులు
- ఢిల్లీ పేలుళ్ల ఘటన నేపథ్యంలో ఆందోళన

కరీంనగర్ క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఏ మూలన చీమచిటుక్కుమన్నా తెలిసిపోయేలా పోలీసులకు నిఘా వ్యవస్థ ఉంటుంది. నక్సల్స్ ప్రాబల్యం ఉన్న సమయంలో ఉమ్మడి జిల్లాలో నిఘావర్గాల సమాచారంతోనే వందల సంఖ్యలో పోలీసులు ఆపరేషన్‌లు నిర్వహించి విజయం సాధించారు. పోలీసు శాఖకు స్పెషల్ బ్రాంచి, కౌంటర్ ఇంటెలిజన్స్, టాస్క్‌ఫోర్స్ విభాగాలు కళ్లు, చెవులుగా అత్యంత నమ్మకంగా పని చేస్తుంటాయి. ఇందుకుగాను ప్రాంతానికి ఒక అధికారి క్షేత్రస్థాయిలో ప్రత్యేకంగా తన సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసుకుని మఫ్టీలో తిరుగుతూ అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెడుతూ సమాచారాన్ని ఉన్నతాధికారులకు అందిస్తుంటారు. కొద్దికాలంగా నిఘా వ్యవస్థ పనితీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నాలుగు రోజుల క్రితం మయన్మార్ దేశానికి చెందిన ఇద్దరు వ్యక్తులు అబుల్ బషీర్ (68), అబ్దుల్ హకీం (52) కరీంనగర్‌లోని ఒక ప్రార్థనామందిరంలో ఉండగా టూటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మయన్మార్‌కు చెందిన ఇద్దరి వద్ద ఎలాంటి పాస్‌పోర్ట్‌, వీసాలు లేవని తెలిసింది. అక్రమంగా దేశంలోకి వచ్చిన వీరు ఉమ్మడి జిల్లాలోని జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్‌లో గడిపిన తరువాత పోలీసులకు ఎవరో సమాచారం అందిస్తే అదుపులోకి



తీసుకుని విచారణ అనంతరం హైదరాబాద్‌లోని బాలాపూర్ శరణార్థుల శిబిరానికి తరలించారు. ఒక వైపు ఢిల్లీలో ఉగ్రవాదుల పేలుళ్ల ఘటన, మరో వైపున హైదరాబాద్‌లో ఉగ్రవాదిని అరెస్టు చేయడం వంటి ఘటనలతో భయాందోళనల వాతావరణం నెలకొంది. ఈ సమయంలో పాస్‌పోర్ట్‌, వీసాలు లేకుండా, స్థానిక పోలీసులకు ఎలాంటి సమాచారం లేకుండా ఇద్దరు మయన్మార్ దేశస్థులు 3, 4 రోజులు కరీంనగర్‌లో మకాంవేయటం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీసా, పాస్‌పోర్ట్ లేకుండా విదేశీయులు కొన్ని రోజులు గడిపినప్పటికీ పోలీసులకు సమాచారం లేకపోవటం నిఘా వైఫల్యంగా విమర్శలు వస్తున్నాయి.

● గతంలోనూ ఇలాంటి సంఘటనలు

అసాంఘిక కార్యకలాపాలపై అనునిత్యం నిఘా పెట్టాల్సి ఇంటెలిజన్స్ వ్యవస్థ ఎంక్వయిరీలకే పరిమితమవుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో ఇప్పటికే ఉగ్రవాద సంఘటనలు జరిగిన నేపథ్యంలో పోలీసులకు సమాచారం లేకుండా విదేశీయులు కరీంనగర్‌కు చేరుకుని ఆశ్రయం పొందిన విషయం కలకలం రేపింది. 2014 ఫిబ్రవరి 1న నలుగురు ఉగ్రవాదుల ముఠా కరీంనగర్‌లో నాలుగు రోజుల పాటు మకాం వేసి చొప్పదండి ఎస్‌బీఐలో 46 లక్షల రూపాయలు దోపిడీ చేశారు. అయినా నిఘా వ్యవస్థలు పసిగట్టలేకపోయాయి. కొంతకాలం క్రితం ఎస్ఐఓ సాను భూతిపరుడైన జగిత్యాలకు చెందిన ఒకవ్యక్తిని త్రీటౌన్ పరిధిలో కేంద్ర నిఘా సంస్థ అధికారులు పట్టుకునే వరకు తెలియలేదు. అంతకు ముందు బస్టాండ్‌లో పేలుడు ఘటనలు, ఉగ్రవాదుల ఘటనలు చాలా జరిగాయి. ఇప్పటికయినా నిఘా వ్యవస్థల పనితీరును మెరుగుపరిచి, సమాచార సేకరణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరముందని ప్రజలు కోరుతున్నారు.

● ప్రస్తుత జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో 2000 సంవత్సరంలో ఫిబ్రవరి 7న సాయంత్రం 6:20

(మిగతా 8వ పేజీలో)

ఇద్దరు మయన్మార్ వాసులను అదుపులోకి తీసుకున్నాం..

- సృజన్‌రెడ్డి, కరీంనగర్ టూ టౌన్ సీఐ

మయన్మార్ దేశానికి చెందిన ఇద్దరు వ్యక్తులు కరీంనగర్‌లో ఉన్నట్లు సమాచారంతో వారిని అదుపులోకి తీసుకుని ఈ నెల 8న హైదరాబాద్‌లోని బాలాపూర్ శరణార్థుల శిబిరానికి పంపించాం, వీరిద్దరు ప్రార్థనా మందిరాల్లో ఆర్థిక సహాయం అడుగుతునట్లు విచారణలో వెల్లడైంది. అన్ని కోణాల్లో విచారణ జరిపిన తరువాత వారిని శరణార్థుల శిబిరానికి తరలించాం.

> 2002 నవంబర్ 23న అర్ధరాత్రి 11:30 గంటలకు కరీంనగర్ మండలం రేకుర్తి శివారులో పోలీసులకు, ఓ ఉగ్రవాదికి మధ్య కాల్పులు జరిగాయి. హైదరాబాద్‌లోని మలక్‌పేటకు చెందిన సయ్యద్ అజీజ్ ఈ కాల్పుల్లో మృతి చెందినట్లుపోలీసులు గుర్తించారు. లష్కరే తోయిబా ఉగ్రవాద సంస్థలో అతడు సభ్యుడని పోలీసుల విచారణలో తేలింది.

> 2020 ఏప్రిల్‌లో టూరిస్టు వీసాపై వచ్చి మతప్రచారంలో పాల్గొన్న ఇండోనేషియన్ దేశవాసులు 10 మందితోపాటు ఢిల్లీకి చెందిన ఇద్దరు గైడ్స్ కరీంనగర్ వచ్చారు. కొవిడ్ వైరస్ అప్పుడప్పుడే విస్తరిస్తోంది. పోలీసులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా ప్రార్థనా మందిరాల్లో ఆశ్రయం పొందారు. అప్పటికే వారికి కొవిడ్ పాజిటివ్ ఉంది. వారి ద్వారా పలువురికి కొవిడ్ వ్యాపించింది. అధికారులు రాష్ట్రంలోనే మొదటిసారి రెడ్‌జోన్‌ను ఏర్పాటు చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన విదేశీయులపై కరోనా వైరస్‌ను వ్యాపింపజేసినందుకు,వారికి సహాయకులుగా పనిచేసిన కరీంనగర్‌కు చెందిన ముగ్గురిపై కరీంనగర్ పోలీసులు నమోదు చేశారు. ఈ మేరకు 10 మంది ఇండోనేషియన్‌లు, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇద్దరు, కరీంనగర్‌కు చెందిన ముగ్గురిపై కేసు నమోదు చేశారు.

ఆయిల్ పామ్ సాగు లాభదాయకం



ఆయిల్ పామ్ సాగును పరిశీలిస్తున్న అధికారులు

భగత్‌నగర్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రైతులు ఆయిల్ పామ్ సాగుచేస్తే లాభదాయకంగా ఉంటుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జె భాగ్యలక్ష్మి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి పి కమలాకర్‌రెడ్డి అన్నారు. కొత్తపల్లి మండలంలోని కమాన్‌పూర్‌లో సిరిపురం పర్శరాములుకు చెందిన ఆయిల్ ఫామ్ సాగును వారు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయిల్ పామ్ తోటలో అంతర పంటగా కంది సాగు చేసుకోవచ్చన్నారు. ఆయిల్ పామ్ సాగుకు ఎకరానికి ఒక్కో సంవత్సరానికి 4,200 రూపాయల చొప్పున ప్రభుత్వం నాలుగు సంవత్సరాల పాటు ప్రోత్సాహకం ఇస్తుందని తెలిపారు. లోహియా ఎడిబుల్ ఆయిల్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ రైతులకు మొక్కలు అందించి, గెలలు కొనుగోలు చేస్తోందన్నారు. కొన్ని 14 రోజుల్లోపు డబ్బులు చెల్లిస్తుందని చెప్పారు. రైతులు ఆయిల్ పామ్ సాగు చేపట్టి అధిక ఆదాయం పొందాలనిన సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు కె రణధీర్‌రెడ్డి, వ్యవసాయ అధికారి కె సంతోష్, ఉద్యాన అధికారి వి ఐలయ్య, ఏఈవో రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

సీపీఐ శతజయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

భగత్‌నగర్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): సీపీఐ శత జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని మాజీ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో జరిగిన సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత కమ్యునిస్టు ఆవిర్భవించి డిసెంబరు 25 నాటికి వందేళ్ళు పూర్తవుతుందన్నారు. రాష్ట్రంలో శత జయంతి ఉత్సవాలను డిసెంబరు 15 నుంచి 21 వరకు నిర్వహిస్తున్నామన్నారు. కుమరం భీం జిల్లా జోడేఘాట్ నుంచి భద్రాచలం వరకు నిర్వహించే రాష్ట్ర జాతాను విజయవంతం చేయాలని కోరారు. డిసెంబరు 26న ఖమ్మంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో సీపీఐ కీలక పాత్ర పోషించిందన్నారు. కార్మిక, కర్షక, ప్రజా సమస్యలపై నిరంతరం ఉద్యమాలు నిర్వహిస్తున్న పార్టీ సీపీఐ అన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, పొనగంటి కేదారి, అందె స్వామి, కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, బత్తుల బాబు, నాగెల్లి లక్ష్మారెడ్డి, కొయ్యడ సృజన్‌కుమార్, బోయిని అశోక్, గూడెం లక్ష్మి, పిట్టల సమ్మయ్య పాల్గొన్నారు.

చిన్నారులను సొంత పిల్లలుగా చూసుకోవాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాఖడే

తిమ్మాపూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులను తమ సొంత పిల్లలుగా చూసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాఖడే సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని రామకృష్ణకాలనీ అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలను అదనపు కలెక్టర్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా చిన్నారుల బరువు, రిజిస్టర్లను పరిశీలించారు. ప్రీ స్కూల్ పిల్లలతో ఆమె మాట్లాడారు. ప్రీ స్కూల్ యాక్టివిటీని పరిశీలించారు. ఈ సందర్భంగా అశ్విని తానాజీ వాఖడే మాట్లాడుతూ జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాల పనితీరు అద్భుతంగా ఉందన్నారు. విద్యార్థులను ఆకట్టుకునే రీతిలో అంగన్‌వాడీ కేంద్రాలను తయారు చేయాలన్నారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులను పకడ్బందీగా నిర్వహించాలని, మురుగు కాలువల్లో ఎప్పటి కప్పుడు చెత్తా చెదారం తొలగించాలని అధికారులను ఆదేశించారు. వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు.



రామకృష్ణకాలనీలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పాఠాలు చెబుతున్న అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాఖడే

వినియోగదారుల సమస్యలను పరిష్కరించాలి

- టీజీఎన్‌పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్మన్ ఎన్‌వీ వేణుగోపాలచారి

గణేశ్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యలను వెంట వెంటనే పరిష్కరించాలని టీజీఎన్‌పీ డీసీఎల్ విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్మన్ ఎన్‌వీ వేణుగోపాలచారి అన్నారు. మంగళ వారం నగరంలోని ఒకటో సెక్షన్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటుచేసిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు వినియోగదారులు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పలువురు క్షేత్రస్థాయి అధికారులు సీటీఆర్‌ఎస్‌కు వచ్చే ఫిర్యాదులపై సకాలంలో స్పందించడం లేద న్నాన్నారు. సకాలంలో స్పందించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యుత్ వినియోగదారుల ఫోరం సభ్యులు కె రమేశ్, ఎన్ దేవేందర్, టీజీ ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ మేక రమేశ్‌బాబు, ఏసీవో రాజేంద్ర ప్రసాద్, డీఈ రాజం పాల్గొన్నారు.



వినియోగదారుల సమస్యలు తెలుసుకుంటున్న ఎన్‌వీ వేణుగోపాలచారి

బాలికల్లో భరోసా నింపేందుకే ‘స్నేహిత’

- ప్రతి పాఠశాలలో ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు
- కలెక్టర్ పమేలా సత్పతి



సీమంతం కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ పమేలా సత్పతి, అధికారులు

గంగాధర, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): బాలికల్లో ధైర్యం, భరోసా నింపేందుకే స్నేహిత కార్యక్రమం, మహిళలకు ఆరోగ్యంపై అవగాహన పెంచేందుకు శుక్రవారం సభకు శ్రీకారం చుట్టినట్లు కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. మంగళవారం గంగాధర మండలం గర్షకుర్తి ప్రభుత్వ పాఠశాలలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్నేహిత-2 అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలికల భద్రతకు పెద్దపీట వేస్తూ ప్రతి పాఠశాలలో ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఫిర్యాదుల పెట్టె తాళం చెవి నోడల్ అధికారి, షీ టీం సిబ్బంది వద్ద ఉంటుందన్నారు. విద్యార్థులు తమకు జరిగిన ఇబ్బందులను పేపర్‌పై రాసి ఇందులో వేస్తే అధికారులే విచారించి కారుకులపై చర్యలు తీసుకుంటారని వివరించారు. ఎవరైనా వేధించినా, అసభ్యకరంగా ప్రవర్తించినా ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. టోల్ ఫ్రీ నంబర్ 1098, 100కు సమాచారం ఇవ్వాలని బాలికలకు సూచించారు. పోక్సో చట్టం గురించి వివరించారు. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనించాలని, వారితో స్నేహంగా ఉంటూ అన్ని విషయాలను తెలుసుకోవాలని సూచించారు. ఏబీసీ ఆఫ్ లైఫ్ రైమ్‌లో భాగస్వామ్యులైన గర్షకుర్తి ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో కలెక్టర్ ముచ్చటించారు. బాగా చదివి ఉన్నత స్థానాలకు వెళ్లాలని ఆకాక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వేదికపై విలువలు తెలిపే ప్లకార్డును ప్రదర్శించారు.

● పరిష్కార వేదికగా శుక్రవారం సభ

మహిళలకు సంబంధించిన వివిధ రకాల సమస్యలకు పరిష్కార వేదికగా శుక్రవారం సభ నిలుస్తుందని కలెక్టర్ తెలిపారు. మహిళలకు ఆరోగ్య, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించేందుకు ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సభను నిర్వహిస్తున్నామన్నారు. ఆరోగ్య మహిళ కింద ప్రభుత్వ ఆసుపత్రుల్లో సుమారు 54 రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతర గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. సీడబ్ల్యూసీ చైర్మన్ ధనలక్ష్మీ మాట్లాడుతూ అనాథలు, బాల్యవివాహాలు, సంరక్షణ కొరవడిన పిల్లల గురించి తెలిస్తే తమకు సమాచారం ఇవ్వా లని అలాంటి వారి బాధ్యత తాము తీసు కుం టామని తెలిపారు. షీ టీం సీఐ శ్రీలత మాట్లాడుతూ సోషల్ మీడియాను ప్రజా ప్రయో జనానికి మాత్రమే ఉపయోగించాలన్నారు. అపరిచి తులతో ఎలాంటి వివరాలు పంచుకోవద్దని బాలి కలకు సూచించారు. సోషల్ మీడియాకు విద్యా ర్థులు దూరంగా ఉండాలన్నారు. జిల్లా సంక్షేమాధికారి సరస్వతి మాట్లాడుతూ మహిళలు, చిన్నారుల సంక్షేమ కోసం ప్రవేశపెడుతున్న కార్యక్ర మాలు వివరించారు. అనంతరం ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విటమిన్ గార్డెన్‌ను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైద్యశాఖ ప్రోగ్రాం అధికారి సనా, బాలికల అభివృద్ధి అధికారి కృపారాణి, సీడీపీవో నర్సింగరాణి, తహసీల్దార్ రజిత, ఎంపీడీవో రాము పాల్గొన్నారు.

పశువుల సంరక్షణ యజమానుల బాధ్యత

కరీంనగర్‌టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు వీధుల్లో విచ్చలవిడిగా తిరుగుతున్న పశువుల సంరక్షణ బాధ్యత యజమానులదేనని, రోడ్లపై వదిలివేయడం చట్టవిరుద్ధమని మున్సిపల్ కార్పొరేషన్ వెటర్నరీ అధికారి డాక్టర్ వై దుర్గాప్రసాద్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం నగరంలో శానిటేషన్, పశు సంరక్షణ విభాగం, సహాయ యానిమల్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధి సహకారంతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఎస్సారార్ కళాశాల, పరిసరాల్లో యథేచ్ఛగా వదిలి వేసిన తొమ్మిది ఆవులను ఆధీనంలోకి తీసుకున్నట్లు తెలిపారు. నగరంలో పశు పోషకులు రోడ్లపై వదిలిపెట్టిన పశువుల సంరక్షణ బాధ్యత తీసుకోవాలని, లేకపోతే తెలంగాణ మున్సిపల్ చట్టం-2019, క్రూరత్వ నిరోధక చట్టం-1960 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పొగతో విద్యార్థినులకు అస్వస్థత

● ఆందోళనకు గురైన తల్లిదండ్రులు

6

మౌలానా అబుల్ కలాం సేవలు మరువలేనివి

8

న్యాయమూర్తులకు ఘనంగా వీడ్కోలు

కరీంనగర్ క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో సీనియర్ సివిల్ జడ్జిలుగా పనిచేస్తున్న ఇద్దరు న్యాయమూర్తులు పదోన్నతిపై బదిలీ అయిన సందర్భంగా వారిని కరీంనగర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించి వీడ్కోలు తెలిపారు. కరీంనగర్ జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి వెంకటేష్ మేడ్చల్ పోక్సో కోర్టుకు, కరీంనగర్ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కే శ్రీలేఖ సంగారెడ్డి పోక్సో కోర్టుకు అదనపు జిల్లా జడ్జిలుగా పదోన్నతి పొంది బదిలీ అయ్యారు. జిల్లాకోర్టు ఆవరణలోని న్యాయ సేవా సదన్‌లో ఏర్పాటుచేసిన ఈ వీడ్కోలు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా జడ్జి ఎస్ శివకుమార్ హాజరయ్యారు బార్ అసోసియేషన్ అధ్యక్షులు లింగంపల్లి నాగరాజు, ప్రధాన కార్యదర్శి అరుణ్ కుమార్‌ల ఆధ్వర్యంలో న్యాయమూర్తులను సన్మానించారు.

గౌరీశంకరాలయంలో కార్తీక దీపోత్సవం

కరీంనగర్ కల్చరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం సందర్భంగా స్థానిక పాతబజార్ గౌరీశంకరాలయంలో కార్తీక దీపోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు వివిధ ఆకృతుల్లో ఆలయ ఆవరణలో రంగురంగుల రంగవల్లులు వేసి అందులో దీపాలు వెలిగించారు. కార్తీక దీప దానాలు చేశారు. ఆలయ అర్చకుడు పురాణం మహేశ్వరశర్మ దీపారాధన విశిష్టత, బ్రహ్మ, విష్ణు, మహేశ్వర వైభవాన్ని వివరించారు. కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ప్రొద్దుటూరి శ్రీనివాస్, ఈవో వుడుతల వెంకన్నపాల్గొన్నారు.







పాతబజార్ గౌరీశంకరాలయంలో దీపాలంకరణ, ప్రత్యేక అలంకరణలో శివలింగం

ఫుడ్ పాయిజన్‌పై విచారణ

- పాడైన కోడిగుడ్లు, నిత్యం పచ్చిపులుసు
- వెల్లడించిన విద్యార్థులు



విద్యార్థులతో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకట్‌రెడ్డి

జమ్మికుంట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక బాలికల పాఠశాలలో సోమవారం జరిగిన ఫుడ్ పాయిజన్ ఘటనపై తహసీల్దార్ వెంకట్‌రెడ్డి మంగళవారం విచారణ చేపట్టారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయిని విజయ, ఉపాధ్యాయులు, విద్యార్థి సంఘాల సమక్షంలో మధ్యాహ్న భోజనం వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ ఇబ్బందులను వివరించారు. తక్కువ భోజనం పెడ్తున్నారని, రెండోసారి వెళ్తే ఇంకా ఎంత తింటారు? మిగతా వారికి సరిపోవద్దా? అంటారని పేర్కొన్నారు. నిత్యం పలుచటి పప్పు, ఏ కర్రీలోకైనా పచ్చి పులుసు, నీళ్లు పోసుకొని తిన్నట్లుగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. పాడైన కోడిగుడ్లు పెడుతున్నారని, వాసన వస్తున్నాయని చెప్పినా పట్టించుకోరని తహసీల్దార్ ఎదుట వాపోయారు. పావుకిలో పప్పుతో పలుచటి నీళ్ల లాంటి పప్పు, పచ్చి పులుసు, నాలుగు కిలోల బియ్యం, ఒక్క ఉల్లిగడ్డతో 70మంది విద్యార్థులకు మధ్యాహ్నభోజనం వండి పెట్టారని ఉపాధ్యాయుడు శ్రీనివాస్ చెప్పడం, అలాంటిది ఏం లేదని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయిని పరస్పరం విమర్శించుకోవడం చూసి అక్కడున్న అధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. విద్యార్థుల నుంచి తీసుకున్న స్టేట్‌మెంట్‌ను ఉన్నతాధికారులకు నివేదిస్తామని తహసీల్దార్ లిపారు. ఆహార పదార్థాల నుంచి ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అంకిత్‌రెడ్డి శాంపిల్స్ సేకరించారు. రిపోర్టు వచ్చిన తర్వాత ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్, సీఐ రామకృష్ణగౌడ్ ఉన్నారు.

తపాలా బీమాతో ధీమా

- తక్కువ ప్రీమియం
- ఎక్కువ ప్రయోజనాలు
- ఆసక్తి చూపుతున్న యువత



భగత్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నమ్మకం.. భద్రత... అనే ముద్ర వేసుకున్న తపాలా శాఖ ప్రజలకు మరింత భద్రత కోసం తపాలా జీవిత బీమా పాలసీలను అందిస్తున్నది. తక్కువ ప్రీమియం ఎక్కువ బోనస్ లభించే విధంగా బీమా పాలసీలను రూపొందించారు. తపాలా జీవిత బీమాతో ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే ఆ కుటుంబానికి పరిహారం అందుతుంది. ఈ తరుణంలో తపాలా బీమా పాలసీలపై యువత ఎక్కు వగా ఆసక్తి చూపుతుండటం విశేషం. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా తపాలా శాఖ జీవిత బీమా పాలసీ లను అమలు చేస్తున్నది. మొదట్లో ఉద్యోగులకు మాత్రమే అందుబాటులో ఉన్న జీవిత బీమా పాలసీలను ఆ తరువాత క్రమంగా గ్రాడ్యుయేట్‌లు, గ్రామీణ ప్రాంత ప్రజలకు కూడా అందుబాటులోకి తీసుకువచ్చింది. ఉద్యోగులు, గ్రాడ్యుయేట్‌లకు (పిఎల్‌ఐ) ను రక్ష, సువిధ, సుమంగల్, సంతోష్, యుగల్ సరక్ష, జీవిత బీమా పాలసీలు అందుబాటులో ఉన్నాయి. గ్రామీణ ప్రాంత ప్రజల కోసం (ఆర్పీఎల్ఐ) గ్రామ సురక్ష, గ్రామ సంతోష్, గ్రామ సువిధ, గ్రామ సుమంగల్, గ్రామ ప్రియ అందుబాటులో ఉన్నాయి. పిల్లల కోసం చిల్డ్రన్ పాలసీ కూడా అమలులో ఉంది. 19 సంవత్సరాల నుంచి 55 సంవత్సరాల మధ్య ఉన్న వారు ఈ తపాలా జీవిత బీమా పాలసీలకు అర్హులు. ప్రతి వ్యక్తి పీఎల్ఐ (పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్) అయితే 50 లక్షలు, ఆర్పీఎల్ఐ (రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్) అయితే 10 లక్షలు ఇన్సూరెన్స్ చేసుకునే అవకాశం ఉంది. ప్రీమియంపై ఆదాయపు పన్ను మినహాయింపు ఉంది. నామినిని మార్చుకునే వెసలుబాటు ఉండగా, పోస్టాఫీసులకు వెళ్లకుండానే ఆన్‌లైన్‌లో ప్రీమియం చెల్లించే సదుపాయం ఉంది. ఇలా అనేక ఫీచర్లతో తపాలా శాఖ జీవిత బీమా పాలసీలను అమలు చేస్తు న్నది. జీవిత బీమా పాలసీలు అన్ని తపాల శాఖ కార్యాలయాల్లో అందుబాటులో ఉన్నాయి.

బీమాపై స్పెషల్ డ్రైవ్

- తపాల శాఖ ఎస్పీ కె శివాజీ



తపాలా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీమా పాలసీలను ప్రజలకు చేరువ చేసేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాము. ప్రజలను ఎక్కువ సంఖ్యలో తపాల జీవిత బీమాలో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

పాఠశాలలో గడ్డిమందు తాగిన విద్యార్థి

● ఆస్పత్రిలో చేర్పించిన ఉపాధ్యాయులు

గన్నేరువరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న బోయిని సాయికుమార్ అనే విద్యార్థి మంగళవారం తరగతి గదిలో గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఉపాధ్యాయులు, విద్యార్థి తల్లిదండ్రుల వివరాల ప్రకారం. గత శుక్రవారం సాయికుమార్ మృతి చెందిన పామును పాఠశాలలోని తరగతి గదికి తీసుకొచ్చి తోటి విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేశాడు. దీంతో ఉపాధ్యాయులు విద్యార్థిని మందలించి తల్లిదండ్రులను తీసుకురావాలని ఆదేశించారు. దీంతో శని, ఆదివారం సెలవు ఉండడంతో ఇంట్లో ఈ విషయాన్ని చెప్పలేదు. సోమవారం సైతం పాఠశాలకు వెళ్లకుండా ఇంటి వద్దనే ఉన్నాడు. మంగళవారం పాఠశాలకు వెళ్లిన సాయికుమార్ తరగతి గదిలో గడ్డిమందు తాగాడు. వెంటనే ఉపాధ్యాయులు విద్యార్థి తండ్రి బోయిని చంద్రయ్యకు సమాచారం అందించి అంబులెన్స్‌లో కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. ప్రస్తుతానికి విద్యార్థి ఆరోగ్యం నిలకడగా ఉన్నా 24 గంటలు గడిస్తేనే ప్రాణాపాయం తప్పుతుందని వైద్యులు తెలపడంతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. ఈ సంఘటనపై పాఠశాల హెచ్ఎం రామయ్యను వివరణ కోరగా సాయికుమార్ పాఠశాలలో ఆకతాయి పనులు చేస్తూ తోటి విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని, తండ్రిని పాఠశాలకు పిలిపించి పరిస్థితి వివరించామని తెలిపారు. దీంతో తన తండ్రి దండిస్తాడేమోనన్న భయంతో గడ్డిమందు తాగినట్లు తెలిపారు. ఈ ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని, విచారణ చేపడతామని ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

హుజూరాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని కేసీ క్యాంపు వద్ద మంగళవారం ప్రమాదవశాత్తు కింద పడడంతో జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ పంజాల ప్రతాప్‌కు తీవ్ర గాయాలయ్యాయి. విధుల్లో భాగంగా ప్రతాప్ ద్విచక్రవాహనంపై హుజూరాబాద్ నుంచి వెళ్తుండగా కేసీ క్యాంపు వద్ద ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

గీత కార్మికుడికి గాయాలు

రామగిరి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని బేగంపేట్ గ్రామానికి చెందిన మడ్డి నాగరాజుగౌడ్ మంగళవారం ఈత చెట్టు పైనుంచి పడి గాయపడ్డాడు. గ్రామశివారులో ఈత చెట్టుపై కల్లు గీస్తున్న క్రమంలో ప్రమాదశాత్తు నిచ్చెన జారి కిందపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. తోటి కార్మికులు హుటాహుటిన పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 27 మందికి జరిమానా

ఎల్లారెడ్డిపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన 27 మందికి జిల్లా రెండో తరగతి జ్యుడీషియల్ న్యాయమూర్తి జయశ్రీ జరిమానా విధించారని మంగళవారం ఎస్ఐ రాహుల్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఇటీవల తనిఖీలు నిర్వహించగా 27 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతున్నారని గుర్తించామని పేర్కొన్నారు. నిర్ధారణ పరీక్షల అనంతరం నివేదిక ఆధారంగా న్యాయస్థానంలో హాజరుపరిచామని చెప్పారు. 27 మందికి మొత్తం 69.5 వేల జరిమానా విధించారని పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

కోనరావుపేట మండలంలో ఎనిమిది మందికి..

కోనరావుపేట : మండలంలో డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 8 మందిని రెండో తరగతి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఎదుట మంగళవారం ప్రవేశపెట్టగా 14 వేల రూపాయలు జరిమానా విధించినట్లు ఎస్సై ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపినట్లు అయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారులు నిబంధనలు పాటించాలని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడుపవద్దన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దన్నారు.

పొగతో విద్యార్థినులకు అస్వస్థత



ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

కరీంనగర్ టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో చెత్త తగలబెట్టగా వెలువడిన పొగతో పలువురు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. మంగళవారం ఉదయం జరిగిన ఈ సంఘటనతో విద్యార్థినులు, తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. జిల్లా కలెక్టర్ కళాశాల ప్రాంగణంలోని ప్రభుత్వ పాఠశాలకు వస్తున్నట్లు వచ్చిన సమాచారం నేపథ్యంలో పాఠశాల ఆవరణలోని చెత్తను తగులబెట్టగా, అక్కడే ఉన్న రెగ్జిన్ కవర్లు, ఇతర పాత సామగ్రిని మంటల్లో వేశారు. అదే సమయంలో కళాశాల విద్యార్థులకు పరీక్ష నిర్వహిస్తుండడంతో కొంత మంది విద్యార్థినులను తరగతి గదిలో, మరి కొందరిని బయట కూర్చొబెట్టి పరీక్షలు రాంయించారు. ఒక్కసారిగా వెలువడిన పొగ, దుర్వాసనతో విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. గమనించిన కళాశాల ప్రిన్సిపాల్ అంబులెన్సులో 11 మంది విద్యార్థినులను జిల్లా ప్రభుత్వ ప్రధానాస్పత్రికి తరలించారు. ముగ్గురిని వెంటనే డిశ్చార్జి చేసిన వైద్యులు తొమ్మిదిని ప్రాథమిక చికిత్స అనంతరం ఇంటికి పంపించారు. అంతకుముందు కొంత మంది విద్యార్థినుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు అక్కడికి చేరుకొని ఆందోళన వ్యక్తం చేశారు. చెత్త నుంచి వెలువడిన పొగ కారణంగానే విద్యార్థినిలు అస్వస్థతకు గురయ్యారని, జిల్లా ప్రభుత్వ ప్రధాన వైద్యశాలకు చికిత్స కోసం పంపించామని ప్రిన్సిపాల్ తెలిపారు. ప్రాథమిక చికిత్స అందించిన తర్వాత విద్యార్థినులకు ఇళ్లకు పంపించినట్లు వైద్యులు చెప్పారు.

ఖనిలో పోలీసుల విస్తృత తనిఖీలు

కోల్‌సిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జరిగిన బాంబు పేలుడు నేపథ్యంలో మంగళవారం గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో గోదావరిఖని బస్టాండ్, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, లక్ష్మీనగర్, ఓల్డ్ అశోక థియేటర్‌తో పాటు ముఖ్య కూడళ్లలో తనిఖీలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. లక్ష్మీనగర్‌లో దుకాణాల సముదాయాల ప్రాంతంలో నిలిపి ఉన్న వాహనాలను, బస్టాండ్‌లో ప్రయాణీకుల బ్యాగులను తనిఖీ చేశారు. వన్‌టౌన్ ఎస్ఐలు రమేష్, భూమేష్, అనూషతో పాటు డాగ్‌స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.



గోదావరిఖని ప్రభుత్వాసుపత్రి, బస్టాండ్ వద్ద తనిఖీ చేస్తున్న పోలీసులు

ఆసక్తిగా ఉమ్మడి జిల్లా స్థాయి ఖోఖో పోటీలు



ఖోఖో పోటీల్లో తలపడుతున్న జట్లు

కథలాపూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని మాస్టో ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన 69వ ఎస్‌జీఎఫ్ అండర్ 14 ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి ఖోఖో పోటీలు ఆసక్తిగా సాగాయి. పోటీలను ప్రారంభించిన ఎంఈఓ లోకిని శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. జీవితంలో ఓటమి, గెలుపులు సహజమని ఓటమిని గుణపాఠంగా తీసుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు క్రీడల్లో మరింత రాణించాల్సిన అవసరం ఉందన్నారు. సమయం మన కోసం మళ్లీ రాదని అవకాశాలు వచ్చినప్పుడే వాటిని వినియోగించుకుంటే జీవితంలో విజయతీరాలకు చేరుతామని అన్నారు. సాయంత్రం ముగింపు ఉత్సవాలకు హాజరైన కోరుట్ల సీఐ సురేశ్ బాబు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు అటు విద్యతో పాటు క్రీడల్లో బాగా రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు.

● అట్టహాసంగా క్రీడలు ప్రారంభం

జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాలకు చెందిన జట్లు హాజరుకాగా ఒలంపిక్ దీపం వెలిగించి లాంగ్ మార్చ్ నిర్వహించడంతో పోటీలు అట్టహాసంగా ఆరంభమయ్యాయి. ఈ పోటీల్లో 8 జట్లు పాల్గొనగా బాలుర విభాగంలో జగిత్యాల ప్రథమ స్థానం, పెద్దపల్లి ద్వితీయ స్థానం, బాలికల విభాగంలో కరీంనగర్ జట్టు ప్రథమ స్థానం, జగిత్యాల ద్వితీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు కోరుట్ల సీఐ మెడల్స్, జ్ఞాపికలను అందించి అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ చక్రధర్, పాఠశాల కరస్పాండెంట్ ఆకుల రాజేశ్, ప్రిన్సిపాల్ ఆకుల రంజిత్, పాఠశాల పీఈటీలు లంబా, మల్లేశ్, ఎస్‌జీఎఫ్ మండల కన్వీనర్ రవీందర్, క్రీడాకారులు, వివిధ పాఠశాలల పిజికల్ డైరెక్టర్లు తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



రఘుపతిరెడ్డి (ఫైల్)

కథలాపూర్, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలం పోసానిపేట శివారులోని ఎల్లమ్మ గుడి సమీపంలో మంగళవారం లారీ బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో జవిడి రఘుపతిరెడ్డి (30) అనే యువకుడు దుర్మరణం చెందాడు. ఎస్సై నవీన్‌కుమార్ కథనం ప్రకారం తాండ్ర్యాల శివారులో ఉన్న పొలం చూసుకొని తిరిగి ఇంటికి వస్తుండగా దాణాతో వెళ్తున్న లారీ అతి వేగంగా బైక్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే రఘుపతిరెడ్డి మృతిచెందాడు. లారీ కల్వర్టు వద్ద బోల్తా పడగా ప్రమాదానికి కారకుడైన డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సంఘటనా స్థలాన్ని కోరుట్ల సీఐ సురేశ్‌బాబు పరిశీలించారు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. మృతుడి తండ్రి రాజరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువతి మృతి



కళ్యాణి (ఫైల్)

బోయినపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : బోయినపల్లి మండలం మిడుమానేరు డ్యామ్ కట్ట సమీపంలో ఈ నెల 9న రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువతి చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం.. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం లంబాడిపల్లి గ్రామానికి చెందిన జెట్టి కళ్యాణి(25) తన మేనబావ బరిగల శ్రీశైలంతో కలిసి బైక్‌పై కొదురుపాక సమీపంలోని మిడ్ మానేరు డ్యాం కట్టపైకి వెళ్లారు. బైక్‌పై తిరిగి వస్తుండగా మెయిన్ రోడ్డుకు సమీపంలో ఎదురుగా వచ్చిన బోయినపల్లి మండలం అనంతపల్లికి చెందిన కారు డ్రైవర్ మీరాల శరత్‌చంద్రరెడ్డి బైక్‌ను ఢీకొట్టాడు. ఈ సంఘటనలో కళ్యాణి తలకు తీవ్ర గాయం కావడంతో ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఈనెల 10న రాత్రి కల్యాణి మృతిచెందింది. మృతురాలి తండ్రి జెట్టి కుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై రమాకాంత్ తెలిపారు.

కుక్క దాడిలో ఇద్దరికి గాయాలు



కోనరావుపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం కనగర్తి గ్రామంలో మంగళవారం వీధి కుక్క దాడిలో ఇద్దరికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన దేవనపెల్లి కౌసల్య, లింగంపల్లి దేవయ్య లు ఇంటికి వెళుతుండగా కుక్క దాడి చేసి గాయపరిచింది. గ్రామస్థులు కుక్కను చెదరగొట్టి చికిత్స నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా వీధి కుక్కల దాడిలో చాలామంది గాయపడుతున్నారని, వాటి నుంచి కాపాడాలని అధికారులను గ్రామస్థులు కోరుతున్నారు.

నేరస్థుడికి ఏడాది జైలుశిక్ష

కరీంనగర్ క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండల పరిధిలోని ఓ మహిళపై అఘాయిత్యానికి యత్నించిన కేసులో చేగుర్తికి గ్రామానికి చెందిన నిందితుడు కళ్లేపల్లి శ్రీనివాస్‌కు కరీంనగర్ కోర్టు మంగళవారం ఒక సంవత్సరం జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధించినట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. కళ్లేపల్లి శ్రీనివాస్ 2017లో మహిళపై అఘాయిత్యం చేయడానికి ప్రయత్నించగా సదరు మహిళ ప్రతిఘటించింది. కేకలు వేయగా చుట్టుపక్కల వారు, కుటుంబ సభ్యులు వచ్చేసరికి నిందితుడు పారిపోయాడు. ఆ తరువాత బాధితురాలి ఫిర్యాదుతో కరీంనగర్ రురల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు విచారణ జరిపి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు కానిస్టేబుల్ పరమేశ్వర్ సాక్షులను కోర్టులో హాజరుపరిచారు. ఏపీపీ రంజిత్ కుమార్ సాక్షులను విచారించిన అనంతరం కరీంనగర్ రెండవ అడిషనల్ జేఎఫ్‌సీఎం జడ్జి వెంకట సత్యరాజ్‌కిరణ్ పూర్వాపరాలు పరిశీలించి నిందితుడికి ఒక సంవత్సరం జైలు శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధించారు.

ఎల్ఎల్‌బీ విద్యార్థుల ఆందోళన



ఆందోళనకు దిగిన విద్యార్థులు

గణేశ్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్శిటీలో ఎల్ఎల్‌బీ మొదటి సంవత్సరం మొదటి ఇంటర్నల్ పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో కళాశాలలో మొత్తం 91 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 40 మంది విద్యార్థులకు హాజరు శాతం లేకపోవడంతో అనుమతించలేదు. దీంతో విద్యార్థులు ఆందోళన చేపట్టారు. పరీక్ష రాసేందుకు విద్యార్థులు యూనివర్శిటీలోని ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రానికి చేరుకున్నారు. హాజరు తక్కువ ఉన్న విద్యార్థులకు పరీక్ష రాసేందుకు అనుమతి ఇవ్వవద్దని ముందే నిర్ణయం తీసుకున్న యూనివర్శిటీ అధికారులు పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో హాజరు తక్కువ ఉన్న విద్యార్థులు పరీక్ష కేంద్రం వద్దకు అనుమతి ఇవ్వాలని, తాము పరీక్ష రాసేందుకు ఇబ్బంది ఏమిటని అధికారులను ప్రశ్నించారు. తక్కువ హాజరు ఉన్నా ఇంటర్నల్ పరీక్ష రాయవచ్చని హైకోర్టు నుంచి ఉత్తర్వులు ఉన్నాయని అధికారులకు వివరించారు. అనంతరం విద్యార్థులను పరీక్ష కేంద్రం బయటకు పంపించారు. ఈ విషయంలో విద్యార్థులు మాట్లాడుతూ కనీస హాజరు శాతం లేకున్నా పరీక్ష రాసే అవకాశం ఉంటుందని, అవేవీ పట్టకుండా అధికారులు తమను టార్గెట్ చేస్తున్నారని, పైరవీలతో వచ్చిన పలువురు విద్యార్థులకు అనుమతి ఇచ్చారని ఆరోపించారు.

కాలం చెల్లిన సరుకులు వాడితే చర్యలు

- కరీంనగర్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అంకిత్‌రెడ్డి

జమ్మికుంట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాలం చెల్లిన సరుకులు వాడితే కఠిన చర్యలు తప్పవని కరీంనగర్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అంకిత్ రెడ్డి అన్నారు. మంగళవారం జమ్మికుంట పట్టణంలోని ఓ బేకరీలో తనిఖీలు చేపట్టారు. కేకు తయారీలోకి ఉపయోగించే ఆరు రకాల ప్రొడక్ట్స్‌ను పట్టుకున్నారు. వాటిని ల్యాబ్‌కు తరలించనున్నట్లు చెప్పారు.

ఈ సందర్భంగా అంకిత్‌రెడ్డి మాట్లాడుతూ బేకరీలు, దుకాణాలు, జనరల్‌స్టోర్స్‌లో కాలం చెల్లినవి వాడితే ఊరుకునే ప్రసక్తి లేదన్నారు. దుకాణదారులు కాలం చెల్లిన వస్తువులు విక్రయిస్తే వినియోగదారులు తమ దృష్టికి తీసుకు రావాలన్నారు.

తన సమస్య తీర్చాలని సెల్ టవర్ ఎక్కిన యువకుడు

● కేసు నమోదు చేసిన పోలీసులు



సెల్ టవర్ ఎక్కిన బోరగళ్ల రాజు

సైదాపూర్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని దుద్దెనపల్లికి చెందిన బోరగళ్ల రాజు అనే యువకుడు మంగళవారం సెల్ టవర్ ఎక్కాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో నచ్చ జెప్పి టవర్ దింపారు. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. బోరగళ్ల రాజు ఇంటి వెనకాల ఉన్న భూమి కొన్ని సంవత్సరాల క్రితం సంజావ్ అనే అతడి వద్ద నుంచి లింగ స్వామి కొనుగోలు చేశాడు. అప్పటి నుంచి బోరగళ్ల రాజు, లింగస్వామి మధ్య గొడవలు అవుతు న్నాయి. చాలా సార్లు పంచాయతీలు నిర్వహిం చారు. తన ఇంటి వెనకాల భూమి ఎలా కొంటావని లింగస్వామిని రాజు అడిగేవాడు. ఎట్టకేలకు లింగస్వామి ఆ భూమిని రాజుకు విక్రయించేం దుకు అంగీకరించాడు. ఈ క్రమంలో తన ఇంటి వెనకాల భూమి తాను అనుకున్న ధరకు ఇప్పించాలని రాజు టవర్ ఎక్కాడు. రాజును అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

యువకుడి ఆత్మహత్య



ప్రశాంత్ (ఫైల్)

కోరుట్ల రూరల్, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల మండలం అయిలాపూర్ గ్రామానికి చెందిన కుడుముల ప్రశాంత్(33) అనే యువకుడు మంగళవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం ప్రశాంత్ ఎంబీఏ పూర్తి చేశాడు. ప్రశాంత్ తన తండ్రి శంకర్‌తో కలిసి చేపలు పట్టి అమ్మేవాడు. ప్రశాంత్‌కు కొన్ని రోజుల నుంచి మానసిన స్థితి బాగా లేకపోవడంతో కుటుంబ సభ్యులు చికిత్స చేయిస్తున్నారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ప్రశాంత్ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వెల్దిలో వృద్ధుడి అదృశ్యం



రాయమల్లు

మానకొండూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెల్దికి చెందిన మారవేని రాయమల్లు (80) అనే వృద్ధుడు అదృశ్యమైనట్లు కేసు నమోదు చేశామని సీఐ సంజీవ్ తెలిపారు. సోమవారం రాత్రి కుటుంబ సభ్యులు భోజనం చేసి నిద్రించారు. కుమారుడు తిరుపతి తెల్లవారుజామున లేచి చూసే సరికి తండ్రి కనిపించలేదు. ఆచూకీ లభించకపోవడంతో తిరుపతి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

క్రీడలతో మానసిక, శారీరక దృఢత్వం



క్రీడా పోటీలను తిలకిస్తున్న అదనపు కలెక్టర్ దాసరి వేణు

సుల్తానాబాద్, నవంబరు11(ఆంధ్రజ్యోతి): క్రీడలతో పాల్గొనడం ద్వారా విద్యార్థులు శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంచుకోవచ్చని అదనపు కలెక్టర్ దాసరి వేణు అన్నారు. మండలంలోని భూపతిపూర్ గ్రామంలోని మహాత్మజ్యోతిరావు పూలే గురుకుల విద్యాలయంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి జిల్లా స్థాయి అండర్ 11 క్రీడా పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించారు. అదనపు కలెక్టర్‌కు విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. జిల్లా సమన్వయకర్త మణిదీప్తి, ఉపాధ్యాయులు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రాథమిక దశ నుంచే విద్యార్థులకు క్రీడలో ఆసక్తి కలిగించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో క్రీడల నిర్వహణపై ఆసక్తి చూపుతున్నారని అన్నారు. విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. వాలీబాల్, కబడ్డీ పోటీలను నిర్వహించగా, జ్యోతిబాపూలే గురుకులాల జిల్లా సమన్వయకర్త మణిదీప్తి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, వైస్‌ప్రిన్సిపాల్ సురేష్ కుమార్, సంక్షేమ అధికారి సంధ్యారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిపో మేనేజర్లతో ఆర్‌ఎం సమీక్ష



మాట్లాడుతున్న ఆర్‌ఎం రాజు

భగత్‌నగర్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రీజియన్ పరిధిలో డిపో మేనేజర్లతో ఆర్టీసీ రీజినల్ మేనేజర్ రాజు మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. అక్టోబరులో డిపోల పనితీరు, ఆర్థిక పరిస్థితిని సమీక్షించారు. రానున్న మేడారం జాతరకు సన్నద్ధతపై చర్చించారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, ప్యాకేజీ టూర్స్ యాత్రా దానం కార్యక్రమాలపై ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణ వంటి అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్లు ఎస్.భూపతిరెడ్డి, పి. మల్లేశం, డిపో మేనేజర్లు ఎం.నాగభూషణం, ఎస్.వెంకన్న, రవీంద్రనాథ్, విజయమాధురి, ఎం.శ్రీనివాస్, విశ్వజిత్ కుమార్, కె కల్పన, మనోహర్, దేవరాజు, టి.ప్రకాశ్‌రావు, శ్రీనివాస్, జి సత్యనారాయణ, ఎ.శంకరయ్య, ఎల్.మల్లేశం, ఆర్ జ్యోత్స్న పాల్గొన్నారు.

- ఇరుకైన గదులు.. విద్యార్థుల ఇక్కట్లు
- అద్దె భవనంలో ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఎస్ బాలుర డిగ్రీ, జూనియర్ కళాశాల...

అసౌకర్యాల మధ్య చదువులు



ఇరుకైన గదిలో బ్యాగుల మధ్య పాఠాలు వింటున్న ఇంటర్ విద్యార్థులు

అద్దె భవనంలో కొనసాగుతున్న కళాశాల

ఎల్లారెడ్డిపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విద్యను అభ్యసించాల్సిన గ్రామీణ ప్రాంతంలోని బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు అరకొర వసతుల మధ్య తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీస సౌకర్యాలు, కిటికీలకు తలుపులు సైతం లేకపోవడంతో చలికి, దోమలకు విద్యార్థులు పడుతున్న బాధలు వర్ణనాతీతం. తరగతి గదుల్లో ఉదయం పాఠాలు వినడంతో పాటు అదే గదిలో రాత్రి నేలపైనే పడుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని మహాత్మాజ్యోతిరావు పూలే బీసీ సంక్షేమ రెసిడెన్షియల్ డిగ్రీ (బాలుర), జూనియర్ కళాశాల అద్దె భవనంలో కొనసాగుతోంది.

అద్దె భవనం.. అవస్థలమయం

మండల కేంద్రంలో వెనుకబడిన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు అప్పటి ప్రభుత్వం 2022లో మహాత్మాజ్యోతిరావు పూలే బీసీ సంక్షేమ రెసిడెన్షియల్ డిగ్రీ(బాలుర) కళాశాలను కేటాయించింది. ఓ భవనాన్ని అద్దెకు తీసుకుని 2023 సంవత్సరం జూలైలో కళాశాల, వసతి గృహాన్ని ప్రారంభించింది. డిగ్రీ కళాశాలలో 55 మంది విద్యార్థులు ఉన్నారు. 2024-2025 విద్యా సంవత్సరంలో పెద్దూరులోని జూనియర్ కళాశాలను అదికారులు ఇక్కడకు తరలించారు. జూనియర్ కళాశాలలో మొత్తం 79 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. సరిపడా గదులు లేవు. డిగ్రీ కళాశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరంలో 12 గ్రూపులను కొనసాగిస్తున్నారు. ఒకే గదిలో రెండు నుంచి నాలుగు గ్రూపులకు సంబంధించిన విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. జూనియర్ కళాశాలలో రెండు గ్రూపులను కలిపి ఒకే గదిలో బోధిస్తున్నారు. తరగతి గదుల్లోనే విద్యార్థులు తమ వస్తువులు, దుస్తులు, పడకలను పక్కన పెట్టుకుని వాటి మధ్య పాఠాలు వినాల్సి వస్తోంది.

విద్యార్థుల ఇబ్బందులు

డిగ్రీ, జూనియర్ కళాశాలలో చదువుతున్న 134 మంది విద్యార్థులు చన్నీళ్లతో స్నానాలు చేయాల్సి వస్తోంది. తరగతి గదులకు కిటికీలు లేకపోవడం చలితో గజగజవణుకున్నారు. సరిపడా స్నానపు గదులు లేవు. భోజనశాల లేదు. ఆదివారం వర్షాలతో ప్రహరీ కూలి కుక్కల ఆవరణలోకి వస్తున్నాయి.

ఉన్నతాధికారులకు నివేదించాం

- వీరప్రభాకర్, ప్రిన్సిపాల్



డిగ్రీ, జూనియర్ కళాశాల అద్దె భవనంలో కొనసాగుతుండడం వల్ల పూర్తిస్థాయిలో వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. తరగతి గదులు సరిపడక గదిలో ఓ వైపు విద్యార్థులు కూర్చొని పాఠాలు వింటూనే రాత్రి సమయంలో డెస్క్‌లను వెనుకకు ఉంచి నేలపై నిద్రిస్తున్నారు. వసతుల కల్పనపై ఉన్నతాధికారులకు నివేదించాం. విద్యార్థులకు అన్ని వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటాం.

ఒకే గదిలో పాఠాలు, పడకతో ఇబ్బందులు..

- లింగాల గిరిధర్, విద్యార్థి



నేను డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్నాను. ఒకే గదిలో ఉదయం పాఠాలు వింటూ రాత్రి సమయంలో నేలపై పడుకోవాల్సి వస్తోంది. చదువుకునేందుకు అవస్థలు పడుతున్నాం. తరగతి గదులు సరిపోవడం లేదు. అన్ని వసతులు కల్పించాలి.

చన్నీళ్లతో జ్వరాలు వస్తున్నాయి

- తంగళ్లపల్లి వర్షిత్, విద్యార్థి



కళాశాలలో చేరి డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యనభ్యసిస్తున్నాను. చలి అధికమవుతున్న చన్నీళ్లతో స్నానం చేయాల్సి వస్తోంది. చలికి తట్టుకోలేకపోతున్నాం. చన్నీళ్ల వల్ల జ్వరం, దగ్గు, జలుబు బారిన పడుతున్నాం. వేడి నీళ్ల సమకూర్చి మా ఇబ్బందులను తీర్చాలి.

కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించిన వ్యక్తి అరెస్ట్

పెద్దపల్లిటౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించిన వ్యక్తిని మంగళవారం పెద్దపల్లి పోలీసులు అరెస్ట్ చేసినట్టు తెలిపారు. కోర్టు ట్రయల్‌కు గైర్హాజరవుతున్న రామావూరికు చెందిన మార్పు సదానందంపై పెద్దపల్లి మేజిస్ట్రేట్ వారెంట్ జారీ చేశారని, దీంతో సదానందంను అదుపులోకి తీసుకుని రిమాండ్ చేసినట్టు తెలిపారు. ఏసీపీ కృష్ణ ఆదేశాలతో సబ్ డివిజన్ పరిధిలో ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కోర్టు ఆదేశాల ప్రకారం సక్రమంగా హాజరై తమ కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు.

లారీని తప్పించబోయి అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు

- తప్పిన పెనుప్రమాదం



రోడ్డు పక్కకు దూసుకెళ్లిన బస్సు

కథలాపూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలం ఇప్పపల్లి శివారులోని పెద్దమ్మ ఆలయం వద్ద మంగళవారం ఎదురుగా వస్తున్న గ్యాస్ లారీని తప్పించబోయి ఆర్టీసీ బస్సు అదుపు తప్పింది. కోరుట్ల డిపోకు చెందిన టీఎస్ 21 టీ 5162 నంబర్ గల ఆర్టీసీ బస్సు 40 మంది ప్రయాణికులతో వేములవాడ నుంచి కోరుట్లకు వస్తోంది. కోరుట్ల వైపు నుంచి వేములవాడకు గ్యాస్ లోడ్‌తో లారీ ఎదురుగా రావడంతో ఒక్కసారిగా బస్సు అదుపు తప్పింది. వెంటనే అప్రమత్తమైన బస్సు డ్రైవర్ అయిలేట్ రోడ్డు పక్కనే ఉన్న భారీ గుంతలోకి వెళ్లకుండా జాగ్రత్త పడ్డాడు. దీంతో బస్సులోని ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు.

రాజన్న ఆలయంలో స్క్రాప్ తరలించేందుకు టెండర్లు

వేములవాడ టౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో వివిధ భాగాలలో పేరుకుపోయిన స్క్రాప్ తరలించేందుకు టెండర్లు నిర్వహించారు. మంగళవారం ఆలయ ఓపెన్ స్లాబ్‌లో నిర్వహించిన టెండర్‌లో వేములవాడకు చెందిన ఒకరు, హైదరాబాద్‌కు చెందిన ఆరుగురు కాంట్రాక్టర్లు పాలుపంచుకున్నారు. సామగ్రిని ఐదుగురు కాంట్రాక్టర్లు దక్కించుకున్నారు. స్క్రాప్ సామగ్రి టెండర్‌లో ఏడుగురు కాంట్రాక్టర్లు చర్చించుకొని ఒక్కో సామగ్రిని ఒక కాంట్రాక్టర్ కైవసం చేసుకున్నారు. టెండర్‌లో ఆలయ ఏఈవో శ్రావణ్‌కుమార్, ఈఈ రాజేష్, డీ మహిపాల్‌రెడ్డి, సూపరింటెండెంట్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న నిత్య కల్యాణంలో చిరిగిన చీర

- ఈనెల 3న పొందిన దంపతులు

వేములవాడ టౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహించే నిత్య కల్యాణంలో చిరిగిన చీర ప్రత్యక్షమైంది. గత సోమవారం కల్యాణం చేయించుకున్న భక్తులకు చిరిగిన చీర వచ్చింది. అనుబంధ దేవాలయమైన భీమేశ్వరాలయంనకు ఆర్జిత సేవలు మార్పిన సందర్భంగా నిత్య కల్యాణం, శాశ్వత కల్యాణాలు అన్నదానసత్రం పైఅంతస్తులో కొనసాగుతున్నాయి. ఈనెల 3న కరీంనగర్‌లో ఉంటున్న నూతన దంపతులు శ్రీలత, శ్రీపతి కల్యాణం చేయించుకున్నారు. వీరికి సమర్పించిన చీరను ఇంటికి వెళ్లాక చూసుకునే సరికి చీరపట్టి చిరిగిపోయి ఉంది. చీరను చూసి ఆ దంపతులు ఆందోళన చెందారు. చీరలను దేవస్థానంనకు టెస్కో నుంచి సరఫరా అవుతాయి. ప్రతి చీరను రూ.300 బిల్లు ఆలయం ద్వారా చెల్లిస్తారు. అయితే నాసిరకం చీరలను సరఫరా చేయడంపై భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



భక్తులకు అందిన చిరిగిన చీర

చీరను చూసి ఆవేదన చెందాం

- శ్రీలత, శ్రీపతి దంపతులు, కరీంనగర్

తాము ఈ నెల 3న శ్రీరాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నాం. అనంతరం రెండు టికెట్లు తీసుకొని కల్యాణం చేయించుకున్నాం. ఇంటికి వెళ్లాక చీరను చూసే సరికి చిరిగి ఉంది. దీంతో చాలా ఆవేదన చెందాం. నాసిరకం చీర ఇవ్వంపై ఆలయ అధికారులకు ఫిర్యాదు చేస్తాం.

మరోసారి కాకుండా చూస్తాం

- బ్రహ్మన్నగారి శ్రీనివాస్, ఏఈవో

కల్యాణంలో ఇలాంటివి పునరావృతం కాకుండా చూస్తాం. కల్యాణం అనంతరం భక్తులకు ఇచ్చే చీరలు పరిశీలించాకే భక్తులకు అందజేస్తాం. చిరిగిన చీరను మార్చి కొత్త చీర ఆ భక్తులకు ఇస్తాం.

ఏటీసీతో ఉపాధి అవకాశాలు

- ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్



విద్యార్థులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్

తంగళ్లపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ)తో యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. మంగళవారం తంగళ్లపల్లి మండలం మండేపల్లి శివారులోని ఏటీసీ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. వివిధ కోర్సుల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులతో మాట్లాడారు. మొత్తం ఎంత మంది విద్యార్థులు చదువుతున్నారని ప్రిన్సిపాల్ అడగగా 166 మంది చదువుతున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ యువత ఏటీసీ సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు ప్రతి అంశాన్ని లోతుగా తెలుసుకోవాలని, ప్రాక్టికల్‌గా కూడా నిత్యం సాధన చేయాలని సూచించారు. ఈ దశలో నేర్చుకున్న అంశాలు ఉద్యోగానికి, వృత్తి జీవితంలో ఉపయోగపడుతాయని తెలిపారు. సమయాన్ని వృథా చేసుకోవద్దని తరగతులను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ కవిత, తహసీల్దార్ జయంత్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీరాంసాగర్‌కు స్వల్పంగా వరద

జగిత్యాల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి మంగళవారం స్వల్పంగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతం నుంచి 9,454 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాకతీయ కాలువ, సరస్వతీ కాలువ, మిషన్ భగీరథ, వరద కాలువ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 9,454 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

ప్రీమెట్రిక్ ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న, పదోతరగతి విద్యార్థులు ప్రీమెట్రిక్ ఉపకార వేతనాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి అనిల్ ప్రకాష్ తెలిపారు. దరఖాస్తులు www.tgepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో సమర్పించాలని పేర్కొన్నారు.

ప్రమాదకరంగా ఘాట్‌రోడ్డు ప్రయాణం



కొండగట్టు ఘాట్‌రోడ్డుపై వాహనాలు

మల్యాల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి వద్దకు చేరుకునే ఘాట్‌రోడ్డుపై ప్రతి మంగళ, శనివారాల్లో వాహనాల రాకపోకలు ప్రమాదకరంగా మారుతున్నాయి. సమ్మక్క, సారక్క జాతరకు ముందు వేలాది భక్తులు వందలాది వాహనాల్లో కొండగట్టుకు వస్తున్నారు. దీంతో వాహనాలను ఘాట్‌రోడ్డుకిరువైపులా రాత్రి నుంచి మరుసటి రోజు మధ్యాహ్నం వరకు అలాగే ఉంచుతుండడంతో రోజంతా కొండపైకి వచ్చే భక్తుల వాహనాలకు తీవ్ర అసౌకర్యంగా మారుతోంది. వైజంక్షన్ వద్ద మూడు మార్గాల్లో వచ్చే వాహనాలతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. ఘాట్‌రోడ్డు నుంచి కొండపైకి వాహనాలు ఎక్కాలన్నా, దిగాలన్నా పద్మవ్యూహం చేదించినట్టు అవుతుందని వాహనాల డ్రైవర్లు పేర్కొంటున్నారు. వాహనాలను ఘాట్‌రోడ్డుపై నిలుపకుండా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

భక్తులతో కిక్కిరిసిన అంజన్న క్షేత్రం

మల్యాల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి క్షేత్రం మంగళవారం భక్తులతో కిక్కిరిసింది. వేలాదిగా వచ్చిన భక్తులు వేకువజాము నుంచే స్వామి వారి దర్శనం కోసం బారులు తీరి మొక్కులు చెల్లించుకున్నారు. కార్తీకమాసంతో పాటు సమ్మక్క సారలమ్మ జాతర రానున్న నేపథ్యంలో అధిక సంఖ్యలో వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు, పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, అధికారులు పర్యవేక్షించారు. అంజన్నను దర్శించుకున్న భక్తులు కోతులకు, శ్రీరాముని ఆలయంలోనూ పూజలు జరిపారు.

అంజన్న సన్నిధిలో సుప్రభాత సేవ

కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 15నుంచి నూతనంగా ప్రవేశపెట్టనున్న సుప్రభాత సేవ సాధ్యాసాధ్యాలను మంగళవారం దేవస్థానం అధికారులు పరిశీలించారు. సేవలో పాల్గొనడానికి ఇద్దరికి అవకాశం ఉండగా టికెట్ ధరను రూ.వెయ్యి. మంగళవారం భక్తులు 12 టికెట్లు కొనుగోలు చేశారని సుప్రభాత సేవ కార్యక్రమం విజయవంతం అయినట్టు దేవస్థానం అధికారులు తెలిపారు. ఈ సేవ ద్వారా భక్తులకు స్వామి వారి మొదటి దర్శన సౌకర్యంతో పాటు దేవస్థానం తరఫున ఒక కండువా, రెండు కనుములు, స్వామి వారి 400గ్రాముల అభిషేక లడ్డూ అందజేసినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈవో శ్రీకాంత్‌రావు, పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్‌తో పాటు ఆలయ అర్చకులు, ఉద్యోగ సిబ్బంది పాల్గొన్నారు. అయితే సుప్రభాత సేవ టికెట్ ధర అధికంగా పెట్టారని దీనిపై ఇద్దరికి కాకుండా కనీసం నలుగురి నుంచి ఐదుగురికి అవకాశం కల్పించాలని భక్తులు కోరుతున్నారు.



కొండగట్టులో భక్తులు



బద్దిపోచమ్మ దేవాలయం వద్ద భక్తులు

బద్దిపోచమ్మ సన్నిధిలో భక్తుల సందడి

వేములవాడ టౌన్ : కార్తీకమాసం సందర్భంగా వేములవాడ బద్దిపోచమ్మ దేవాలయంలో మంగళవారం భక్తుల సందడి నెలకొంది. వేలాదిమంది భక్తులు అమ్మవారికి బోనం వండి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు భక్తులకు రెండు గంటల సమయం పట్టింది. కార్తీక మాసం సందర్భంగా భీమేశ్వరాలయంలో కార్తీక వైభవం నెలకొంది. మంగళవారం భీమన్న సన్నిధిలో కార్తీక దీపోత్సవం నిర్వహించారు.

కొనసాగుతున్న గోదావరి హారతి

ధర్మపురి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకొని ధర్మపురి వద్ద గోదావరి హారతి 21వ రోజు మంగళవారం కొనసాగింది. ఆలయ వేదపండితులు, అర్చకులు గోదావరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. రాత్రి వేళలో మహిళలు దొప్పల్లో దీపాలు వెలిగించి గోదావరి నదిలో వదిలి పుణ్యప్రాప్తి పొందారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి రత్నపద్మావతి, మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి నారాయణ, సీనియర్ సివిల్ జడ్జి తేజస్వి మల్లిక్ సుబ్రమణ్యశర్మ, జూనియర్ సివిల్ జడ్జి లావణ్య, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీనిజ, ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ జక్కు రవీందర్, భక్తులు పాల్గొన్నారు.

పిల్లలు, పెద్దలపై తీవ్ర ప్రభావం

- నివారించగల అంటు వ్యాధి న్యుమోనియా
- నేడు ప్రపంచ న్యుమోనియా దినోత్సవం



సుభాష్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో ప్రతి వెయ్యి మందిలో 11 మంది న్యుమోనియా బారిన పడుతున్నారని నివేదికలు చెబుతున్నాయి. న్యుమోనియాపై ప్రజల్లో అవగాహన పెంచడానికి ప్రతి సంవత్సరం నవంబరు 12న ప్రపంచ న్యుమోనియా దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ఐదు సంవత్సరాలలోపు పిల్లలు, 60 సంవత్సరాలుపైన వారికి రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. వారు న్యుమోనియా బారిన పడేందుకు అవకాశం ఉంటుంది. న్యుమోనియా నివారించగల, చికిత్సతో నయం చేసే అవకాశం ఉన్న అంటు వ్యాధి. ఈ వ్యాధిని త్వరగా గుర్తిస్తే నివారించ వచ్చు. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకంగా మారే అవకాశం ఉంది. న్యుమోనియా, ఇతర శ్వాసకోశ అంటు మరణాల సంఖ్య గత కొన్ని సంవత్సరాలుగా పెరుగుతూ వస్తోంది.

ఈ సంవత్సరం థీమ్ 'పిల్లల మనుగడ'

ప్రపంచ న్యుమోనియా దినోత్సవం సందర్భంగా ఈ సంవత్సరం పిల్లల మనుగడ అనే థీమ్‌ను తీసుకున్నారు. పిల్లల మరణాలకు ప్రధాన కారణంగా న్యుమోనియాను గుర్తించారు. మంచి పోషకాహారం, స్వచ్ఛమైన గాలి, టీకాలు, యాంటిబయాటిక్స్ అందించడం ద్వారా న్యుమోనియాను తగ్గించవచ్చు. సకాలంలో రోగ నిర్ధారణ చేస్తే వ్యాధిని త్వరగా అరికట్టవచ్చు. న్యుమోనియా సోకకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. చల్లగాలులు, వాతవరణ కాలుష్యం, గాలి, దుమ్ము ధూళిపై జాగ్రత్తగా ఉండాలి. బయటకు వెళ్లేటప్పుడు మాస్కు ధరించాలి.

టీకాలు అందుబాటులో ఉన్నాయి..

- డాక్టర్ రవీంద్రాచారి, పల్మనాలజిస్టు



న్యుమోనియా నివారించదగ్గ వ్యాధి. సకాలంలో గుర్తించి డాక్టరును సంప్రదిస్తే చికిత్స అందించి వ్యాధిని నయం చేయవచ్చు. ఇపుడు పూర్తిగా నయమయ్యే టీకాలు అందుబాటులోకి వచ్చాయి. ఆ టీకాలు తీసుకుంటే వ్యాధిని తగ్గించవచ్చు. ఇందులో రెండు రకాల ఉన్నాయి. డాక్టర్ సూచన మేరకు టీకాలు తీసుకోవాలి.

ప్రపంచ వ్యవసాయ సదస్సుకు కోనరావుపేట రైతులు



సదస్సుకు వెళ్లిన రైతులు

కోనరావుపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యవసాయ సదస్సులో పాల్గొనేందుకు రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండల రైతులకు అరుదైన అవకాశం దక్కింది. జర్మనీలో మంగళవారం ప్రారంభమయ్యే ప్రపంచ వ్యవసాయ సదస్సుకు కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన కాటు బండ శ్రీనివాస్, కాటిపల్లి వేణుగోపాల్‌రెడ్డి, నాగారం గ్రామానికి చెందిన ధూమ్‌పేట నాగరాజు సోమవారం బయలుదేరి జర్మనీకి వెళ్లారు. ఈ సదస్సులో మంగళవారం ఆధునిక వ్యవసాయ సాంకేతికతలు సుస్థిర సాగు విధానాల్లో వస్తున్న విప్లవాత్మక మార్పులు, ఆవిష్కరణలపై ప్రపంచవ్యాప్తంగా ఉన్న నిపుణులు, మార్గదర్శకులు చర్చించినట్లు రైతులు తెలిపారు.

నిద్రపోతున్న నిఘా

(5వ పేజీ తరువాయి)

గంటలకు మెట్‌పల్లిలోని వెంకటేశ్వర థియేటర్‌లో బాంబు పేలుడు జరిగింది. సంఘటన జరిగినప్పుడు థియేటర్‌లో 15 మంది ప్రేక్షకులు మాత్రమే ఉన్నారు. టిఫిన్ బాక్స్, ప్లాస్టిక్ బ్యాగ్ సీట్ కింద పెట్టినట్లు గుర్తించారు. అజాం ఘోరీ ఈ సంఘటనకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ కేసును 2000 మే 6న సీఐడీకి బదిలీ చేశారు. అదే సంవత్సరం ఏప్రిల్ 6న జగిత్యాల కొత్త బస్టాండ్ వద్ద అజాం ఘోరీకి, పోలీసుల మధ్య కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో అజంఘోరీ మృతి చెందాడు. అతడు ఇండియన్ ముస్లీం మొహమ్మది ముజాహిదీన్ కమాండర్‌గా పోలీసులు గుర్తించారు. అజంఘోరీ ఐఎస్ఐ ఏజెంట్‌గా వ్యవహరిస్తున్నట్లు విచారణలో తేలింది. లష్కరే తోయిబాతో కూడా సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు గుర్తించారు.

● 2005 ఆగస్టు 9న గుర్తుతెలియని వ్యక్తులు ప్లాస్టిక్ బ్యాగ్‌లో ఒక బాంబును పెట్టి కరీంనగర్ బస్‌స్టేషన్ ప్లాట్‌ఫాం నంబర్ 6 వద్ద ఉంచారు. ఈ బాంబు ఉదయం 9:30-945 గంటల మధ్య పేలింది. ఈ సంఘటనలో 20 మంది ఆర్టీసీ ఉద్యోగులు, ప్రయాణికులు గాయపడ్డారు. ఈ కేసులో నిందితులను ఇప్పటి వరకు గుర్తించ లేదు.

దేశిని చిన మల్లయ్య ఆశయాలను కొనసాగిస్తాం

చిగురుమామిడి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇందుర్తి మాజీ ఎమ్మెల్యే దేశిని చిన మల్లయ్య ఆశయాలను కొనసాగిస్తామని పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంగళవారం దేశిని చిన మల్లయ్య వర్ధంతి సందర్భంగా ప్రకటన విడుదల చేశారు. దేశిని చిన్న మల్లయ్య తెలంగాణ రాష్ట్రానికే ఆదర్శమని కొనియాడారు.

సీడ్ ప్లాంట్ ఎదుట రెండో రోజూ రైతుల నిరసన

శంకరపట్నం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కేశవపట్నం శివారులోని పాటూరి సీడ్ ప్లాంట్ ఎదుట ధాన్యం డబ్బులు చెల్లించాలని మంగళవారం కూడా రైతులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీడ్ ఆర్గనైజర్ మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ యాజమాన్యం వాయిదా ప్రకారం ఇవ్వాల్సిన డబ్బులు చెల్లించాలన్నారు.

చొప్పదండిలో వందేమాతరం ర్యాలీ

చొప్పదండి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వందేమాతర గీతాన్ని రచించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా చొప్పదండి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి తెలంగాణ చౌరస్తా వరకు మంగళవారం వందే మాతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ తాళ్లపెల్లి శ్రీనివాస్‌గౌడ్, నాయకులు ఇప్పనపెల్లి సాంబయ్య, ఉడుత శంకరయ్య, బత్తుల లక్ష్మీనారాయణ, చేపూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బిర్లా స్కూల్‌లో సాఫ్ట్ టెన్నిస్ పోటీలు



రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులు

కరీంనగర్ రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):కరీంనగర్ శివారు బొమ్మకల్‌లోని బిర్లా ఓపెన్ మైండ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో మంగళవారం ఉమ్మడి కరీంనగ్ జిల్లా ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో అండర్-14, అండర్-17బాల, బాలికల విభాల్లో సాఫ్ట్ టెన్నిస్, స్క్వాష్, అండర్-19 బాల బాలికల విభాగాల్లో లాన్ టెన్నిస్, సాఫ్ట్ టెన్నిస్, స్క్వాష్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. విజేత లకు ప్రిన్సిపాల్ డాక్టర్ బబితా విశ్వనాథన్, చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి అభినందించారు.

ఘనంగా దొంత రమేష్ జన్మదిన వేడుకలు

జమ్మికుంట రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ మాజీ కో-ఆర్డినేటర్ దొంత రమేష్ జన్మదిన వేడుకలను నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకుడు దేశిని కోటి కేక్ కట్ చేశారు. అనంతరం శివాలయంలో ప్రత్యేక పూజలు చేసి, అన్నదానం చేపట్టారు. నాయకులు ఎర్రం సతీష్‌రెడ్డి, బొంగోని వీరన్న, పిట్టల శ్వేత, పంజాల అజయ్ తదితరులు పాల్గొన్నారు.

వెన్నంపల్లి విద్యార్థులకు అభినందన

కరీంనగర్ టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి కళా ఉత్సవ్ పోటీలకు ఎంపికైన జడ్పీహెచ్ఎస్ వెన్నంపల్లి విద్యార్థులను కలెక్టర్ పమేలాసత్పతి మంగళవారం అభినందించారు. ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్ గ్రూపులో వెన్నంపల్లి విద్యార్థులు అమరగొండ రోహిత్, అమరగొండ అశ్వరద్, వెంగళ ఆశీష్‌వర్ధన్, చిగుర్ల రిత్విక్‌కుమార్ ప్రతిభ కనబరిచారు. జాతీయస్థాయికి ఎంపికైన తిమ్మాపూర్ కేజీబీవీ విద్యార్థులను, ప్రిన్సిపాల్‌ను అభినందించారు.

● అమెరికన్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈవై స్కిల్‌బ్రిడ్జి ప్రాజెక్టులో భాగంగా నిర్వహించిన నేషనల్ ఫైనాన్షియల్ లిటరసీ అసెస్‌మెంట్ టెస్ట్ (ఎన్ఎఫ్ఎల్ఏటీ)లో జాతీయస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులకు కలెక్టర్ పమేలాసత్పతి సర్టిఫికెట్లు అందజేశారు. డీఈవో మొండయ్య, ప్లానింగ్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

హుజూరాబాద్ రూరల్: హుజూరాబాద్ మండలం చెల్పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించగా కలెక్టర్ పమేలా సత్పతి సర్టిఫికెట్లు అందజేశారు.

దేశ విచ్ఛిన్నానికి ఉగ్రవాదుల కుట్ర

భగత్‌నగర్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదులు దేశాన్ని విచ్ఛిన్నం చేసే కుట్రలు పన్నుతున్నారని రేకుర్తి మాజీ సర్పంచ్ నందెల్లి ప్రకాశ్ అన్నారు. మంగళవారం రేకుర్తిలో ఉగ్రవాదుల ఫ్లెక్సీలను చెప్పులతో కొడుతూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో హిందూ, ముస్లిం, క్రిస్టియన్‌లంతా కలిసి కట్టుగా ఉన్నారని, ఉగ్రవాదులు టోపీలు పెట్టుకొని దేశంలోని ముస్లింలను బదనాం చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల ప్రదానం

కరీంనగర్ టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యా దినోత్సవాల్లో భాగంగా విద్యారంగంలో విశేష కృషిచేస్తున్న గణపురం లక్ష్మి, కరీంనగర్ లక్ష్ ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ మహ్మద్ ముస్తాక్ అలీ, అకాడమిక్ డైరెక్టర్ అఫ్సానాషేక్ దంపతులను జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలతో సన్మానించారు. మంగళవారం స్థానిక కళాభారతిలో గురూస్, స్టూడెంట్స్ అండ్ పేరెంట్స్ డ్యాన్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు గంగారపు మల్లేశం ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

పదో తరగతి విద్యార్థులకు బండి సంజయ్ చేయూత

ఇల్లందకుంట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పదో తరగతి విద్యార్థులకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ చేయూతనందించారని బీజేపీ సీనియర్ నాయకుడు మట్ట పవన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ తన జీతం నుంచి ఉమ్మడి జిల్లాలోని 12,292 మంది పదో తరగతి విద్యార్థుల పరీక్ష ఫీజు కోసం కలెక్టర్లకు చెక్కులు అందజేసినట్లు పేర్కొన్నారు.

మౌలానా అబుల్ కలాం సేవలు మరువలేనివి

కరీంనగర్ టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మొదటి విద్యాశాఖమంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశానికి అందించిన సేవలు మరువలేనివని కలెక్టర్ పమేలాసత్పతి అన్నారు. మంగళవారం ఆయన జయంతి సందర్భంగా కలెక్టరేట్ సమావేశమందిరంలో కలాం చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కలాం జయంతిని జాతీయ విద్యా దినోత్సవంగా, మైనార్టీ సంక్షేమ దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ అశ్వినీ తానాజీ వాకడే, మైనార్టీ సంక్షేమ అధికారి, డీఆర్వో వెంకటేశ్వర్లు, వివిధశాఖల అధికారులు, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో నివాళులర్పిస్తున్న కలెక్టర్ పమేలాసత్పతి

కరీంనగర్ అర్బన్: జిల్లా కాంగ్రెస్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు తాజుద్దీన్ ఆధ్వర్యంలో డీసీసీ కార్యాలయంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి నిర్వహించారు. డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు తాజుద్దీన్ నాయకులు పాల్గొన్నారు.

● నగర కాంగ్రెస్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు అహ్మద్ అలీ ఆధ్వర్యంలో నగరంలోని ఖాన్‌పుర గర్ల్స్ హై స్కూల్‌లో 100 మంది విద్యార్థులకు నగర కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ఏ మోసిన్ పెన్నులు, నోటుబుక్కులు, పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకులు పులి ఆంజనేయులుగౌడ్, కర్ర సత్య ప్రసన్నరెడ్డి, ముస్తాక్ అహమ్మద్, నేహాల్ అహ్మద్, అబ్దుల్ రహమాన్, ఆరిఫ్, దన్ను సిం, మహమ్మద్ చాంద్, మహమ్మద్ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్ రూరల్: కరీంనగర్ రూరల్ మండలం మొగ్దుంపూర్ తెలంగాణ మైనార్టీ గురుకుల బాలుర-3, బొమ్మకల్‌లోని బాలుర 1 ఆశ్రమ పాఠశాలలో జాతీయ విద్యా దినోత్సవం నిర్వహించారు. ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, మాజీ కార్పొరేటర్ ఆరిఫ్ అహ్మద్, కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమోహన్, మహేష్ పాల్గొన్నారు.

తిమ్మాపూర్: తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాల మానకొండూర్ బాయ్స్-1లో మంగళవారం జాతీయ విద్యా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి గంగాధర్, ప్రిన్సిపాల్ పిడిశెట్టి సంపత్ అబుల్ కలాం ఆజాద్‌కు నివాళి అర్పించారు. ఎంపీడీవో మల్హోత్రా, ప్రిన్సిపాల్ సంపత్ పాల్గొన్నారు.

హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ట్రస్టు నిర్వాహకుడు జగదీశ్వర్, ఇన్‌చార్జి హెచ్ఎం భవానీ పాల్గొన్నారు.

త్వరగా గుర్తిస్తే న్యుమోనియా నియంత్రణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ రవీంద్రాచారి

సుభాష్‌నగర్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): త్వరగా గుర్తిస్తే న్యుమోనియాను నియంత్రించవచ్చని మెడికవర్ ఆస్పత్రి వైద్యులు స్పష్టం చేశారు. ప్రపంచ న్యుమోనియా దినోత్సవం సందర్భంగా మంగళవారం ఆస్పత్రిలో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. చలికాలంలో దగ్గు, జలుబుపై నిర్లక్ష్యం, వాతావరణ కాలుష్యం, దూమపానం, ఆహార అలవాట్ల మార్పుతో లంగ్స్‌లో వచ్చే వ్యాధి న్యుమోనియా అన్నారు. చిన్న జాగ్రత్తలు పాటిస్తే పెద్ద ప్రమాదాన్ని అరికట్ట వచ్చన్నారు. న్యుమోనియాకు వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, పల్మనాలజిస్టు రవీంద్రాచారి, క్రిటికల్ కేర్ నిపుణుడు డాక్టర్ ఉపేందర్ రెడ్డి, జనరల్ ఫిజీషియన్ లోకేష్, ఎమర్జెన్సీ ఫిజీషియన్ సత్యనారాయణ, సూపరింటెండెంట్ ప్రియాంక, మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, ఫెసిలిటీ మేనేజర్ తాళ్ల హరీష్ పాల్గొన్నారు.

పారమిత విద్యార్థులకు కలెక్టర్ అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ పమేలాసత్పతి

కరీంనగర్ టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి కళా ఉత్సవ్ పోటీలకు ఎంపికవడం అభినందనీయమని కలెక్టర్ పమేలాసత్పతి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జాతీయస్థాయి కళా ఉత్సవ్ పోటీలకు ఎంపికైన పారమిత విద్యార్థులు ఎస్.ప్రమదశ్రీ, ఎస్.శ్రీసాన్విక, కె.శ్రీవికాస్, కె.వైష్ణవి కలెక్టర్‌ను కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారిని అభినందించారు. హైదరాబాద్‌లో ఈనెల 6,7 తేదీల్లో రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పారమిత డైరెక్టర్ వినోద్‌రావు, హన్మంతరావు, ప్రధానోపాధ్యాయుడు గోపికృష్ణ, సంగీత ఉపాధ్యాయులు జితుమణిశర్మ, కిరణ్ పాల్గొన్నారు.

ప్రజాకవి అందెశ్రీకి ఘన నివాళి

హుజూరాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ మైదానంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ కవి అందెశ్రీ మృతికి మంగళవారం నివాళులర్పించారు. అందెశ్రీ అమరహే అంటూ నినాదాలు చేస్తూ ఆయన సేవలను కొనియాడారు. వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సుభాష్‌నగర్: ప్రజాకవి అందెశ్రీకి ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రజామిత్ర ప్రొగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ మాట్లాడుతూ అందెశ్రీ కవితలు, పాటలు చరిత్రలో నిలిచిపోతాయన్నారు. ఫ్రంట్ కార్యకర్తలు, ప్రజా సంఘాల నాయకులు కడపల విజయకుమార్, పాటకుల భూమయ్య, చంద్రయ్య, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

రుద్రాక్ష ఎగ్జిబిషన్ ప్రారంభం



ప్రారంభిస్తున్న డాక్టర్ దుర్గాప్రసాద్

కరీంనగర్ టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కృషీభవన్‌లో నేపాల్ రుద్రాక్షల ప్రదర్శనను ప్రారంభించారు. ఈ ప్రదర్శనలోని ఏకముఖి రుద్రాక్షల నుంచి 21 ముఖముల రుద్రాక్షల వరకు లభిస్తాయని, పుట్టిన తేదీ ఆధారంగా జన్మరాశి జన్మ నక్షత్రానికి సరిపడే రుద్రాక్షలు అందజేస్తామని నిర్వాహకుడు, రుద్రాక్ష నిపుణుడు డాక్టర్ దుర్గా ప్రసాద్ తెలిపారు. కార్తీక మాసంలో రుద్రాక్షలను ధరిస్తే అనేక సత్ఫలితాలు కలుగుతాయన్నారు. ఈనెల 15వ తేదీ వరకు ప్రదర్శన ఉంటుందని, కరుంగళి మాలలు, కరుంగళి బ్రాస్‌లెట్‌లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

మహిళా కాంగ్రెస్‌ను బూత్‌స్థాయిలో పటిష్టం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కర్ర సత్యప్రసన్నరెడ్డి

కరీంనగర్ అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరిస్తూ బూత్‌స్థాయిలో మహిళా కాంగ్రెస్‌ను పటిష్టం చేయాలని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నరెడ్డి పిలుపునిచ్చారు. డీసీసీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జిల్లా మహిళా కాంగ్రెస్ కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. స్థానిక ఎన్నికల్లో మహిళా కాంగ్రెస్ నేతల గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. అనంతరం ఇటీవల నల్గొండ జిల్లాకు చెందిన రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు దుబ్బ రూప అకాల మృతికి మౌనం పాటించారు. రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు గాజుల సుకన్య, ప్రధాన కార్యదర్శి వంగల జ్యోతిరెడ్డి, కార్యదర్శి వంగల కల్యాణిరెడ్డి, నగర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వెన్నం రజిత రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు, అసెంబ్లీ ఇన్‌చార్జిలు పద్మ, హసీనా, హుజూరాబాద్ పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పుష్పలత పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ధ్యానం చేయాలి

హుజూరాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ నిత్యం ధ్యానం చేయాలని మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య అన్నారు. మంగళవారం హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ మైదానంలో మిరమిడ్ మాస్టర్ చింత అనిల్ అధ్యక్షతన ధ్యాన విద్యార్థి మహాయజ్ఞం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలోని 9,10వ తరగతి విద్యార్థులు సామూహిక ధ్యానం చేశారు. అనంతరం సమ్మయ్య మాట్లాడుతూ ధ్యానం అంటే కేవలం శ్వాస మీద ధ్యాస మాత్రమే కాదని, ఆధ్యాత్మిక అంశం కాకుండా విద్యార్థుల ఏకాగ్రతను పెంచే శక్తివంతమైన సాధనమని అన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఎంఈవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్, జమ్మికుంటలో విస్తృత తనిఖీలు



బస్టాండ్‌లో తనిఖీ చేస్తున్న పోలీసులు

హుజూరాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ పేలుడు ఘటనతో హుజూరాబాద్ పట్టణంలో ఏసీపీ మాధవి ఆధ్వర్యంలో మంగళవారం బస్టాండ్, రద్దీ ప్రాంతాలు, దుకాణాల్లో డాగ్ స్క్వాడ్ బృందాలతో విస్తృత తనిఖీలు చేపట్టారు. నార్కోటిక్స్ ఇన్‌స్పెక్టర్ పుల్లయ్య, ఎస్సై యూనస్ అహ్మద్ అలీ పాల్గొన్నారు.

జమ్మికుంట రూరల్: జమ్మికుంట పట్టణంలో కరీంనగర్ నార్కోటిక్ సీఐ పుల్లయ్య, రామకృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం రైల్వే స్టేషన్, బస్టాండ్, ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్లలో తనిఖీలు చేపట్టారు.

మహిళల ప్రపంచ కప్‌తో పెరిగిన దేశ ప్రతిష్ట



ప్రారంభిస్తున్న జిల్లా ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ గంగాధర్

తిమ్మాపూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): క్రికెట్‌లో మహిళలు ప్రపంచ కప్ సాధించడంతో దేశ ప్రతిష్ట పెరిగిందని, మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ గంగాధర్ అన్నారు. మహాత్మా జ్యోతిబాఫూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ ఆధ్వర్యంలో సీనియర్, జూనియర్ బాలికలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి అండర్ 19 స్పోర్ట్స్ మీట్‌ను మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబా ఫూలే రెసిడెన్షియల్ పాఠశాలలో మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని, ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ నెల 13 వరకు కొనసాగనున్న పోటీల్లో ఉమ్మడి జిల్లాలోని ఎంజేపీ పరిధిలోని 13 జూనియర్ కళాశాలలు, 15 పాఠశాలల 636 మంది విద్యార్థినులు పాల్గొనున్నారు. కార్యక్రమంలో ఎంజేపీ ఆర్సీవో అంజలి, ప్రిన్సిపాల్ సరిత తదితరులు పాల్గొన్నారు.

వందేళ్లుగా నివాసం ఉంటున్న వారికి నోటీసులా..

గంగాధర, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వందేళ్లుగా నివాసముంటున్న వారికి లీగల్ నోటీసులు పంపి మానసిక ఇబ్బందులకు గురి చేయడం సరికాదని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మంగళవారం గంగాధర మండలం గర్షకుర్తి విజయపురి కాలనీ బాధితులతో సమావేశమై సమస్యను తెలుసుకున్నారు. కలెక్టర్, ఆర్డీవోలకు సమస్యను వివరించి న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో సర్వే నంబరు 566లో వంద కుటుంబాలు వంద సంవత్సరాల క్రితం కల్వకోట లక్ష్మణరావు నుంచి సాదా బైనామాల ద్వారా కొనుగోలు చేసి అనుమతులతో ఇళ్లు కట్టుకొని జీవిస్తున్నారన్నారు. బాధితులకు న్యాయం జరిగే పోరాటం చేస్తామన్నారు.

మాజీ ఎమ్మెల్యే దేశిని చిన మల్లయ్య వర్ధంతి



కార్యక్రమంలో గ్రామస్థులు, కుటుంబ సభ్యులు

చిగురుమామిడి, నవంబరు 11 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని బొమ్మన పల్లిలో ఇందుర్తి మాజీ ఎమ్మెల్యే దేశిని చిన మల్లయ్య 8వ వర్ధంతిని మంగళవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గౌడ సంఘం నాయకులు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ, ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో ఆయన పాత్ర మరిచి పోలేమన్నారు. దేశిని చిన మల్లయ్య సతీమణి రాజవ్వ, కుమారులు లక్ష్మణ్, కుమార్, కూతురు ఎల్లవ్వ, బొమ్మనపల్లి గ్రామ గౌడ సంఘం అధ్యక్షుడు వీరగోని విజ్జగిరి, దేశిని రాజయ్య, తాళ్లపల్లి సత్యం చందు పాల్గొన్నారు.

● న్యూస్‌బాక్స్

డయాబెటిస్ స్క్రీనింగ్ టెస్టులు

కరీంనగర్ రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ బొమ్మకల్ ఆధ్వర్యంలో మంగళవారం గ్రామంలో హిందూ వాహిని జెండా వద్ద ఉచితంగా యాబెటిస్ స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించారు. లయన్ పుర మల్ల శ్రీనివాస్, లయన్ బట్టు రాజేందర్, లయన్ చింతల కిషన్ పటేల్, కామిరెడ్డి నరసింహారెడ్డి పాల్గొన్నారు.

గీత పనివారల సంఘం

భగత్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం కరీంనగర్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా నేరెళ్ల సదానందం గౌడ్, ప్రధాన కార్యదర్శిగా న్యాలపట్ల రాజు గౌడ్, ఉపాధ్యక్షుడిగా బండారి తిరుపతి, ఆకుల రాజయ్యగౌడ్, తాళ్లపల్లి చంద్రయ్యగౌడ్, బుర్ర అశోక్‌గౌడ్, బండారిపల్లి వెంకటేశం గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, కోశాధి కారిగా మల్లయ్యగౌడ్ ఎన్నికైనట్లు రాష్ట్ర కో-కన్వీనర్ బొమ్మ గాని నాగభూషణం గౌడ్ తెలిపారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

గణేశ్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఎంచుకున్న ఎరంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రముఖ మోటివేటర్ రఘు అన్నారు. మంగళవారం కోతిరాంపూర్‌లోని అచీవర్స్ ఆక్టివ్ పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఏ రంగంలోనైనా అంకిత భావంతో పనిచేస్తే గుర్తింపు దక్కుతుందన్నారు. డైరెక్టర్ కె.వేణుగోపాల్ రెడ్డి, ప్రిన్సిపాల్ పల్లవి పాల్గొన్నారు.

14న కార్తీక దీపోత్సవం

కరీంనగర్ కల్చరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా కార్తీక దీపోత్సవ సమితి ఆధ్వర్యంలో ఈ నెల 14న సాయంత్రం 6 గంటలకు గాంధీరోడ్‌లోని టీటీడీ కల్యాణమండపంలో కార్తీక దీపోత్సవం నిర్వహించనున్నట్లు సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పోల్సాని సుగుణాకర్‌రావు పిలుపునిచ్చారు. మంగళవారం కల్యాణమండపంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో జగన్, మహిపాల్, మారుతి, బ్రహ్మం, జితేందర్‌రెడ్డి, రాజేందర్, నరహరి, హనుమాండ్లు, విశ్వనాథం, స్వామి, మల్లేశం, తిరుపతి, విజయలక్ష్మి, చంద్రకళ, చంద్రయ్య, కిషోర్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కరాటేలో ప్రతిభ

హుజూరాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):హుజూరాబాద్‌కు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ కనబర్చినట్లు గ్లోబల్ షోటోకాన్ కరాటే డో ఇండియా జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్కే జలీల్ మంగళవారం తెలిపారు. హనుమకొండ జిల్లా కాజీపేటలోని ఏజీఆర్ గార్డెన్‌లో నిర్వహించిన నేషనల్ లెవెల్ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలు- 2025 లో ఆరు గోల్డ్ మెడల్స్, ఒక సిల్వర్ మెడల్ సాధించినట్లు పేర్కొన్నారు.

ఉపాధ్యాయుడిని కేటాయించాలి

హుజూరాబాద్ రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాట్రపల్లి యూపీఎస్ పాఠశాలకు గణిత ఉపాధ్యాయుడిని కేటాయించాలని మంగళవారం మాజీ సర్పంచ్ కాసగోని నిరోషా-కిరణ్ ఎంఈవో శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. కొన్ని నెలలుగా మ్యాథ్స్ టీచర్ మెటర్నిటీ లీవ్‌లో ఉన్నారని, విద్యార్థులకు గణితం బోధించడానికి ఉపాధ్యాయుడు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

సోషల్ మీడియా పోస్టులపై జాగ్రత్తలు పాటించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీవో సబిత

కరీంనగర్ రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో పోస్టులపై జాగ్రత్తలు పాటించాలని సీడీపీవో సబిత, మెప్మా పీడీ స్వరూప రాణి అన్నారు. స్నేహిత కార్యక్రమంలో భాగంగా బొమ్మకల్‌లోని గురుకుల పాఠశాలలో మంగళవారం విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ప్రతి స్కూల్‌లో స్నేహిత కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు.సేఫ్ టచ్, అన్‌సేఫ్ టచ్, సెల్ఫ్ ప్రొటెక్షన్, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 సర్వీసెస్, చదువు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ప్రతీ స్కూల్‌లో ఫిర్యాదు బాక్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

భగత్‌నగర్: కొత్తపల్లి మండలం ఎలగందల్ ఆదర్శ పాఠశాలలో మంగళవారం పోషకాహారం, బాలికల సామాజిక భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ శ్రావణి మాట్లాడుతూ విద్యార్థినులు గుడ్ టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్గి ఉండాలన్నారు. ఎంఈవో ఆనందం, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, సాయికిరణ్, మండల వ్యవసాయాధికారి సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్ సైనిక్ స్కూల్, చొప్పదండి బాలుర ఉన్నత పాఠశాలలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మోహన్, మెడికల్ ఆఫీసర్ సురేందర్, టాస్క్‌ఫోర్స్ ఎస్సై సురేందర్, షీటీం స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: మండలంలోని మల్యాల జడ్పీహెచ్ఎస్‌లో స్నేహితపై తహసీల్దార్ రాజమల్లు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎంపీడీవో రాజేశ్వర్‌రావు, హెచ్ఎం రాములు తదితరులు పాల్గొన్నారు.

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరి, మాదిమాణిక్యం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్నేహిత-2 కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఎంఈవో పావని, ఎంపీవో కిరణ్‌కుమార్, డాక్టర్ నిహారిక, మహిళా శిశు సంక్షేమ శాఖకు చెందిన మహిళా సాధికారత కేంద్రం జెండర్ కో-ఆర్డినేటర్ కవిత, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ రజిత పాల్గొన్నారు.

వీణవంక: మండలంలోని కొర్కల్ జిల్లా పరిషత్ ఉన్నత, ఘన్ముకుల ఆదర్శ పాఠశాలల్లో స్నేహితపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ మోయిజ్ బేగ్, ప్రధానోపాధ్యాయుడు శ్రీకాంత్, ఎంపీవో సురేందర్, మెడికల్ ఆఫీసర్ సుచరిత పాల్గొన్నారు.